

మెదక్, ఖమ్మంలో విద్యావైజ్ఞానిక మహాసభలు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 1: ఈ నెల 4న మెదక్‌లో, 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే విద్యా వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నట్టు టీపీటీఎఫ్ నాయకులు తెలిపారు. చిన్నశంకరంపేట పాఠశాలలో గురువారం వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను వారు విడుదల చేశారు. మహాసభల్లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంఘయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ శశిధర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రమేష్‌చారి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌చారి, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస రాజకీయం

మున్సిపాలిటీల్లో మారుతున్న సమీకరణలు

- చైర్మన్, వైస్ చైర్మన్లను తప్పించడానికి సభ్యుల ఎత్తుగడలు
- ప్రత్యర్థి పార్టీలతో చేతులు కలిపేందుకు సై
- బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ!
- సంగారెడ్డి జిల్లాలో మూడు మున్సిపాలిటీలను కోల్పోయే ప్రమాదం
- సొంత పార్టీ కౌన్సిలర్ల తిరుగుబాటుతో చేష్టలుడిగిన అధిష్ఠానం

మున్సిపాలిటీల్లో రాజకీయ సమీకరణలు అనూహ్యంగా మారుతున్నాయి. రాష్ట్రస్థాయిలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించగా.. ప్రభుత్వం మారడంతో సొంత పార్టీ కౌన్సిలర్లే తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లను తప్పించడానికి ప్రత్యర్థి పార్టీలతో చేతులు కలిపేందుకు వెనుకాడడం లేదు. పలుచోట్ల చైర్మన్, వైస్ చైర్మన్లను గద్దె దించడానికి నోటీసులు ఇవ్వగా గులాబీ పార్టీ అధిష్ఠానం నిబంధనలను మార్చడం ద్వారా అడ్డుకున్నది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకోవడంతో స్థానికంగానూ సత్తాచాటడానికి కాంగ్రెస్ సిద్ధమవుతున్నది. ఆయా మున్సిపాలిటీలపై పట్టు సాధించడానికి వ్యూహాలు రచిస్తున్నది.




సదాశివపేటలో

9న ముహూర్తం

- సమావేశం నిర్వహణకు కలెక్టర్ ప్రకటన
- గత నెల 18న కౌన్సిలర్ల అవిశ్వాస నోటీసు
- హైకోర్టును ఆశ్రయించిన చైర్‌పర్సన్..
- అప్పీలు డిస్మిస్ కావడంతో కార్యచరణ ప్రారంభించిన పాలనా యంత్రాంగం

సదాశివపేట, ఫిబ్రవరి 1: సదాశివపేట మున్సిపాలిటీలో అవిశ్వాస సమావేశానికి రంగం సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేక సమావేశాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్టు కలెక్టర్ నోటీసు జారీచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ 22 మంది కౌన్సిలర్లు గత నెల 18న కలెక్టర్‌కు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. అవిశ్వాసాన్ని అడ్డుకోవాలని కోరుతూ చైర్‌పర్సన్ దాఖలు చేసిన అప్పీలును హైకోర్టు డిస్మిస్ చేసింది. సదాశివపేట బల్దియాలో 26 మంది కౌన్సిలర్లు ఉండగా.. పార్టీలకు అతీతంగా 22 మంది ఏకమై చైర్‌పర్సన్‌ను గద్దె దింపేందుకు నోటీసులు ఇచ్చారు.

బీఆర్ఎస్‌కు షాక్ తప్పదా!

అవిశ్వాసానికి 18 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపితే చైర్‌పర్సన్ పదవిని కోల్పోతారు. అవిశ్వాసం నెగ్గితే పట్టణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పట్టు కోల్పోయే అవకాశం ఉన్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సొంత పట్టణంలో బల్దియా పీఠాన్ని కోల్పోవడం ఆయనకు ఇబ్బందికరంగా మారనుంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మున్సిపాలిటీని హస్తగతం చేసుకోవడానికి పావులు కదుపుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్‌లోని మరో వర్గం వైస్ చైర్మన్‌పై సైతం అవిశ్వాసం పెట్టడానికి సిద్ధమవుతున్నట్టు పుకార్లు వినిపిస్తున్నాయి. చాలాకాలం కాంగ్రెస్‌లో కొనసాగి అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలోకి.. అక్కడి నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఓ నాయకుడు తన సతీమణిని చైర్‌పర్సన్ పీఠంపై కూర్చోబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. కానీ, దీనికి కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఆ పార్టీలోని కీలక నాయకులు అంగీకరించకపోవచ్చని తెలుస్తున్నది. దీంతో ప్రత్యేక సమావేశంపై ఆసక్తి నెలకొన్నది.

నారాయణఖేడ్‌లో నేడే ప్రత్యేక సమావేశం

- బల్దియాలో కాంగ్రెస్ బలం 12, బీఆర్ఎస్ వైపు ఆరుగురు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 1: నారాయణఖేడ్ మున్సిపాలిటీలో అవిశ్వాస నోటీసుపై చర్చించేందుకు అధికారులు నేడు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, వైస్ చైర్మన్ పరశురాంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి వెంకటేష్ గురువారం ప్రకటించారు. 15 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు సమావేశానికి హాజరు కావాలని నోటీసులు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిసి 18 ఓట్లుండగా 12 మంది కోరం ఉంటే సమావేశం నిర్వహిస్తామని, లేదంటే అవిశ్వాసం వీగినట్టు ప్రకటిస్తామని తెలియజేశారు.

అప్పుడు గెలిచినా.. ఇప్పుడు తప్పదా!

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసంతో ఖేడ్‌లో ఉత్కంఠత నెలకొంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున 8 మంది, బీఆర్ఎస్ నుంచి ఏడుగురు కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌కు మెజార్టీ ఉన్నప్పటికీ, ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎంపీ బీబీపాటిల్, అప్పటి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ల ఓట్లతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు బీఆర్ఎస్ దక్కించుకుంది. కొద్ది రోజులకే కాంగ్రెస్ కౌన్సిలర్ నర్సింహులు బీఆర్ఎస్‌లో చేరారు. గత నెల మొదటి వారంలో బీఆర్ఎస్‌కు చెందిన సంధ్యారాణి రామకృష్ణ, మాజీద్‌తో పాటు నర్సింహులు కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 10కి చేరుకోగా, బీఆర్ఎస్‌కు ఐదుగురు సభ్యులున్నారు.

జిల్లా కేంద్రంలో తెరవెనుక మంత్రాంగం

- పావులు కదుపుతున్న జగ్గారెడ్డి
- సంగారెడ్డిలో కౌన్సిలర్ల రహస్య సమావేశం!

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1: సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లతా విజయేందర్‌రెడ్డిలపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు పలువురు కౌన్సిలర్లు జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో గురువారం రహస్యంగా సమావేశమయ్యారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానం నోటీసులను కలెక్టర్‌కు అందజేసేందుకు కౌన్సిలర్ల సంతకాలు సేకరించినట్లు తెలిసింది. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను గద్దె దించేందుకు అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలకు చెందిన పలువురు కౌన్సిలర్లు సంతకాలు చేసినట్లు తెలిసింది.

26 మంది సానుకూలం

సంగారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 38 మంది స్థానాలకు... రెండేళ్ల క్రితం చింతల్‌పల్లి కౌన్సిలర్ మృతిచెందడంతో ప్రస్తుతం 37 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి 26 మంది సంతకాలు అవసరం ఉంటుంది. ఈమేరకు బీఆర్ఎస్ 13 మంది, కాంగ్రెస్ నుంచి 9 మంది, బీజేపీ, ఎంఐఎంల నుంచి ఇద్దరు చొప్పున కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలిపినట్టు తెలిసింది.

జగ్గారెడ్డి వ్యూహం

సంగారెడ్డిలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పావులు కదుపుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లతో సమావేశమై కాంగ్రెస్‌కు మద్దతునివ్వాలని కోరినట్టు సమాచారం. దీంతో అవిశ్వాసానికి అనుకూలంగా మెజారిటీ కౌన్సిలర్లు సంతకాలు చేసినట్లు తెలిసింది. అవిశ్వాసం నెగ్గిన తర్వాత కొత్త చైర్‌పర్సన్ ఎవరనేది తేల్చనున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో అవిశ్వాస అంశాన్ని ముందుండి నడిపించిన 7వ వార్డు కౌన్సిలర్ బోయిని విజయలక్ష్మి శేఖర్‌తో పాటు డీసీసీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి, 22వ వార్డు కౌన్సిలర్ నిర్మలారెడ్డి, 23వ వార్డు కౌన్సిలర్ కూన వనితల పేర్లు చైర్‌పర్సన్ రేసులో వినిపిస్తున్నాయి. అవిశ్వాసం నెగ్గిన తర్వాత చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎవరనేది తానే నిర్ణయిస్తానని జగ్గారెడ్డి కౌన్సిలర్లతో చెప్పినట్టు సమాచారం.

బాగున్నారా సార్..



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం అసెంబ్లీకి వెళ్లి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునితా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, హరీశ్‌రావు నందినగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ షురూ

- సంగారెడ్డి జిల్లాలో 95 కేంద్రాలు, మెదక్‌లో 35 కేంద్రాల్లో నిర్వహణ

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని 95 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. తొలిరోజు సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని శ్రీఅక్షయ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తనిఖీ చేశారు. ప్రాక్టికల్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రాక్టికల్స్ జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో 35 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 759 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 687 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 643 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 594 మంది హాజరైనట్టు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.


సంగారెడ్డిలో ప్రాక్టికల్స్ పరీక్షను పరిశీలిస్తున్న డీఐఈవో గోవిందరామ్

పోలీసులు ఫోన్ లాక్కున్నారని... ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు

- సంగారెడ్డిలో ఓ వ్యక్తి దుశ్చర్య

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 1: డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తుండగా ఫొటోలు తీసినందుకు పోలీసులు ఫోన్ లాక్కున్నారని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సంగారెడ్డిలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు గురువారం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అదే సమయంలో అటుగా వచ్చిన నందిగారి సంతోష్‌కుమార్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌తో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసుల ఫొటోలు తీశాడు. తమ ఫొటోలు ఎందుకు తీస్తున్నావని ట్రాఫిక్ పోలీసులు అతడిని ప్రశ్నించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు దురుసుగా సమాధానం ఇచ్చాడు. దీంతో పోలీసులు సంతోష్‌కుమార్ నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. తన ఫోన్ తిరిగిచ్చేయాలని లేదంటే చనిపోతానని సంతోష్‌కుమార్ పోలీసులను బెదిరించాడు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న పెట్రోల్‌బంకులోకి వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ తీసుకొని వచ్చి తన ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. సంతోష్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గాయాలతో సంతోష్‌కుమార్

నేరాల నియంత్రణకు నోడల్ అధికారులు

- ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత
- జిల్లాలో మొదటిసారి ప్రయోగం
- నేర రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం : సంగారెడ్డి ఎస్పీ రూపేష్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 1: నేరాలను కట్టడికి సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నేరాలు జరిగే ఆస్కారమున్న విభాగాలకు నోడల్ అధికారుల నియామకం చేపట్టడం ద్వారా కొత్త ఒరవడి సృష్టించారు.


సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

నోడల్ అధికారులు వీరే..

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివలింగంకు యాంటీ డ్రగ్, డిస్పోసబుల్ కమిటీ బాధ్యతలు అప్పగించారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సైబర్‌క్రైమ్స్, సేఫ్టీక్లబ్ బాధ్యతలు కేటాయించారు. పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డికి ట్రాఫిక్‌పై అవగాహన, యాక్సిడెంట్ రిజిస్టర్, రిపోర్టు అనాలసిస్ బాధ్యతలను ఇచ్చారు. హోంగార్డు ఆర్ఐ హన్మిరెడ్డికి భరోసా, చైల్డ్‌ఫ్రెండ్లీ కార్నర్, షీ టీం, కళాబృందాలు, కమ్యూనిటీ పోలీసింగ్, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీకి కెపాసిటీ బిల్డింగ్, పోలీస్ మ్యాన్యువల్ అమలు, కోర్టు మానిటరింగ్ కమిటీ, ప్రివెన్షన్ రివ్యూ కమిటీలు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌కు సీసీటీవీ ప్రాజెక్టు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్‌కు క్రైంరివ్యూ, ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్, ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణకు ఐటీ, సీసీటీఎన్ఎస్ 2.0 ప్రాజెక్టు, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవికి కమ్యూనికేషన్, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావుకు క్లూస్‌టీం బాధ్యతలను అప్పగించారు.

సబ్‌డివిజన్లవారీగా షీటీంలు

మహిళలపై జరుగుతున్న వివిధరకాల నేరాలను అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా నియమించిన జిల్లా షీటీంను ఎస్పీ రూపేష్ పునర్వ్యవస్థీకరించారు. సబ్‌డివిజన్లవారీగా నూతన టీంలను ఏర్పాటు చేశారు. అలాగే సైబర్ నేరగాళ్ల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాబృందాల ద్వారా మరింత విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.

చట్టవ్యతిరేక చర్యలను సహించం

జిల్లాలో చట్టవ్యతిరేక చర్యలను సహించేది లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే కార్యకలాపాలను అడ్డుకుంటాం. జిల్లా యంత్రాంగం నియమించిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలు చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

-రూపేష్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ

కొంచెం ఇష్టం కొంచెం కష్టం

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వస్తున్నది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టగా ఆయా వర్గాలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచాయి. పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించ లేదని కొందరు పెదవి విరిచారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి రూ.7 లక్షల వరకు, స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75 వేలకు పెంచడంతో వేతన జీవులు కొంత ఊరట చెందారు. బీజేపీ నాయకులు ప్రగతిశీల బడ్జెట్‌గా కొనియాడారు. ఆయా వర్గాల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...

పన్ను చెల్లింపుదారులకు ఊరట లభించలేదు



మధ్యంతర బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించలేదు. పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో ఉన్న పన్ను విధానాన్నే కొనసాగించడం నిరాశను కలిగించింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, విద్యాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు పెంచితే బాగుండేంది.

-సుంకరి కృష్ణ, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మెదక్

శాశ్వత అభివృద్ధికి పునాదులు



ఆదాయ పన్ను మినహాయింపును ఏడాదికి రూ.7 లక్షల వరకు పెంచడం ఉపయోగకరం. కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్నవారికి ఈ మినహాయింపు వరిస్తుంది. ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ ప్రస్తుతం రూ. 50 వేలు ఉండగా తాజా బడ్జెట్‌లో రూ.75 వేలకు పెంచారు. జనాకర్షక పథకాలు లేకుండా శాశ్వత అభివృద్ధికి పునాదులు వేస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశానికి శ్రేయస్కరం.

- జి.ఎల్లం, తపస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్

అన్నివర్గాలకు ఉయోగపడేలా బడ్జెట్



కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలకు ఉపయోగపడేలా ఉంది. పేదల ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్ సహకరిస్తుంది. కిరాయి ఇళ్లలో ఉండేవారికి సొంతింటి కలను తీర్చేందుకు కొత్త హౌసింగ్ స్కీం తీరుస్తుంది. ప్రతీ ఇంటికి 300 యూనిట్ల సోలార్ విద్యుత్ ఉచితంగా అందిస్తామని ప్రకటించడం ద్వారా కరెంట్ కష్టాలు లేని దేశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించింది.

-మధుసూదన్, బీజేపీ నాయకుడు, మెదక్

79 మంది బాల కార్మికులకు విముక్తి : ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1: జిల్లాలో ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 79 మంది బాల కార్మికులకు వెట్టి నుంచి విముక్తి కల్పించామని మెదక్ ఎస్పీ బాలస్వామి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుశాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక, విద్యాశాఖలు, సఖి కేంద్రం సమన్వయంతో బాల కార్మికులను గుర్తించడానికి జిల్లావ్యాప్తంగా దాడులు నిర్వహించినట్టు ఆయన తెలియజేశారు. బాలకార్మికుల్లో 14 మంది బాలికలు, 65 మంది బాలురు ఉన్నారని, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించామని వివరించారు. చిన్నారులతో వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు తీసుకుంటామని, మైనర్లను వేధింపులకు గురిచేస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలకార్మికులు, వీధి బాలలు కనిపిస్తే 1098 లేదా 100 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

అమలులోకి ప్రత్యేకాధికారుల పాలన

- ఉత్తర్వులు జారీ చేసిన మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా 469 గ్రామ పంచాయతీలకు 469 మంది జిల్లా, మండలస్థాయి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించారు. ప్రభుత్వ ఆదేశాలతో వారు సర్పంచ్‌ల నుంచి రికార్డులు, డిజిటల్ కీలను స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీకి వచ్చిన నిధులను వినియోగించడానికి ఇక నుంచి ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ చెక్ పవర్ కొనసాగనుంది.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఆర్డీవో

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. మునిపల్లి మండలం లింగంపల్లిలో గురువారం అక్రమ నిర్మాణాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తెన్‌మొలి, డిప్యూటీ తహసీల్దార్ కృపాదానం, సర్వేయర్ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో అక్రమ కట్టడాలను పరిశీలించిన అధికారులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 1 : మనోహరాబాద్ శివారులోని రామాయపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా షెడ్డు నిర్మించిన వారికి నోటీసులు జారీ చేస్తామని నీటి పారుదల శాఖ ఏఈ అనురాధ, డీఈ శ్రీకాంత్ తెలిపారు.

ఊరూరా ఉత్సాహంగా పాతపంటల జాతర



అల్గోల్‌లో డీడీఎస్ మహిళలతో తాజా మాజీ సర్పంచ్ జ్యోతిమోహన్

జహీరాబాద్, ఫిబ్రవరి 1 : డీడీఎస్(డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో పాతపంటల జాతర కార్యక్రమం ఊరూరా ఉత్సాహంగా కొనసాగడం సంతోషంగా ఉందని అల్గోల్ సర్పంచ్ జ్యోతిమోహన్ పేర్కొన్నారు. డీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అల్గోల్ గ్రామంలో పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 ఏళ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలో డీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలను, రైతులను, అధికారులను ప్రభావితం చేసేదిశగా పాతపంటల జాతర నిర్వహించడం సంతోషకరమన్నారు. డీడీఎస్ సిబ్బంది పాతపంటల జాతర పేరుతో ఎడ్లబండ్లకు చిరుధాన్యాలతో అలంకరించి పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ డప్పుచప్పుళ్లతో వీధుల్లో నృత్యాలు చేస్తూ తిరుగడం ఆకట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ మహిళా రైతులు, జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్, మంజుల, పూలమ్మ, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, చంద్రమ్మ, కమలమ్మ, జనరల్ నర్సమ్మ, మొగులమ్మ, బాలయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్మకాండకు వెళ్లి.. చెరువులో మునిగి యువకుడి మృతి



బాలేష్ మృతదేహం

తూప్రాన్, ఫిబ్రవరి 1: కుటుంబీకుల్లో ఒకరు మృతిచెందడంతో కర్మకాండ తంతుకు చెరువు వద్ద స్నానాలు చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పిట్ల వెంకటయ్య ఇటీవల హల్దీవాగులో పడి మృతిచెందగా గురువారం దశదినకర్మకాండ కార్యక్రమాన్ని గ్రామంలోని నర్సింహుల చెరువు వద్ద నిర్వహించారు. కర్మకాండ తంతులో కుటుంబీకులతో పాటు ఇదే గ్రామానికి చెందిన చిన్నపిట్ల బాలేష్ (34) పాల్గొన్నారు. స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లిన బాలేష్ నీట మునిగిపోయాడు. కుటుంబీకులు అందరూ చూస్తుండగానే చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. గాలింపు చర్యలు చేపట్టి బాలేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. బాలేష్ భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 1 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో రేపు జరిగే కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలకు సంస్కరణల పేరుతో యాజమాన్యాలకు మేలు జరిగేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితో దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. హక్కులను కాపాడుకునేందుకు కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏషియన్ పెయింట్స్ కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని ఘనమైన మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. గతంలో అనేక మాయమాటలు, ఆచరణ సాధ్యం కానీ హామీలతో ఎన్నికైన సంఘాలు యాజమాన్యాలకు వత్తాసు పలికి కార్మికులకు తీరని అన్యాయం చేశారని గుర్తుచేశారు. కార్మిక పక్షపతిగా వ్యవహరించే ఐఎన్‌టీయూసీ హక్కుల సాధనలో రాజీపడే ప్రసక్తే ఉండదన్నారు. సమావేశంలో హెచ్ఎంఎస్ జాతీయ నాయకుడు సుదర్శన్, ఐఎన్‌టీయూసీ జాతీయ యువత కన్వీనర్ సత్యజిత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి నర్సింహారెడ్డి, యూనియన్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో సర్పంచులను సన్మానించిన ఎంపీపీ స్వరూప



రామాయంపేట మండలం డి.ధర్మారంలో సర్పంచ్, వార్డుమెంబర్లను సన్మానిస్తున్న అధికారులు



చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో సర్పంచ్, వార్డు మెంబర్లను సన్మానిస్తున్న గ్రామస్థులు

సర్పంచులు, వార్డు మెంబర్లకు వీడ్కోలు

గ్రామాల్లో ఐదు సంవత్సరాల పాటు సేవలందించిన సర్పంచులు, పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీ కాలం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారికి మండల అధికారులు, ఎంపీపీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు వీడ్కోలు పలికారు. సర్పంచులను, వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు.

కంది, ఫిబ్రవరి 1: మండంలోని ఎద్దుమైలారం, బ్యాతోల్, కవలంపేట, కాశీపూర్, ఇంద్రకరణ్ గ్రామాల్లో గురువారం పాలకవర్గసభ్యులను పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎద్దుమైలారంలో సర్పంచ్ కాసాల మల్లారెడ్డి సిబ్బందిని సన్మానించారు. బ్యాతోల్ గ్రామంలో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి ఆయన సతీమణి శిరీషతో కలిసి పాలకవర్గసభ్యులను సన్మానించారు.

- **చిలప్‌చెడ్:** మండల పరిధిలోని అంతారంలో సర్పంచ్ ఆశోక్‌గౌడ్, వార్డు మెంబరు పెంటమ్మ, నరహరి, స్నేహలత, ప్రకాష్, చెన్నయ్య లస్కర్, సోని, కవితలను గ్రామ నాయకులు ఘనంగా సన్మానించారు.
- **వెల్దుర్తి:** మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్‌గౌడ్ కలిసి మండల సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఎంపీవో విఘ్నేశ్వర్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.
- **చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట, జంగరాయి గ్రామాల్లో సర్పంచులను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట సర్పంచ్ రాజీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.
- **రామాయంపేట:** ధర్మారం, లింపూర్, అక్కన్నపేట సర్పంచులు, వార్డు సభ్యులను ఎంపీడీవో ఉమాదేవి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఛైర్మన్ ముస్కుల స్రవంతిసిద్ధిరాంరెడ్డి పాల్గొన్నారు.
- పాపన్నపేట: కొత్త లింగాయపల్లిలో సర్పంచ్ నవీన్‌గౌడ్, ఉప సర్పంచ్ రవి, వార్డు మెంబర్లు రాములు, కిష్టవ్వ, లక్ష్మి, కేశవ్వ, చింతకాల రాములు, ఎలికాం పుష్పలతలను గ్రామస్థులు, సెక్రెటరీ వెంకటరమణ ఘనంగా సన్మానించారు.
- **రాయికోడ్:** కర్చల్, జమాల్పూర్ గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు.



కర్చల్ గ్రామ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు



చిన్నశంకరంపేటలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



ఎద్దుమైలారంలో పంచాయతీ సిబ్బందిని సన్మానించిన సర్పంచ్ కాసాల మల్లారెడ్డి, పాలకవర్గసభ్యులు

సంగారెడ్డిలో మున్సిపల్ కార్మికుల భిక్షాటన



సంగారెడ్డిలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 1: సంగారెడ్డి పట్టణంలో గురువారం మున్సిపల్ కార్మికులు సీఐటీయూ అద్వర్యంలో భిక్షాటన చేశారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నందుకు నిరసనగా భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ... కార్మికులకు సమయానికి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వేతనాలు అడిగితే పనిలో నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం శోచనీయమన్నారు. కార్మికుల బకాయి వేతనాలు చెల్లించకుంటే విధులు బహిష్కరించి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు యాదగిరి, సురేష్, మల్లేశం, సువర్ణ, సంగీత, శశికళ, సుజాత, మహేశ్వరి, రాజు, వీరేశం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జైలుకు వెళ్లి వచ్చినా తీరు మారలే!

● గంజాయి విక్రయిస్తూ మూడోసారి పట్టుబడిన నిందితుడు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 1: రెండుసార్లు జైలుకెళ్లి వచ్చినా అతడి తీరు మారలేదు. గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడి, మూడోసారి జైలుకెళ్లాడు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా సక్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిమ్రా గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్(35) హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులో రేకులషెడ్‌లో నివసిస్తున్నాడు. పరిసర ప్రాంతాల్లోని కంపెనీ కార్మికులకు ఎండు గంజాయి ప్యాకెట్లు, గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్ పురానాపూల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద కిలోన్నర గంజాయి, బాలానగర్‌లోని రియాజ్ పాన్‌షాప్‌లో 30 గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి హత్నూరలో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జిన్నారం పోలీసులు బుధవారం దాడి చేసి కిలోన్నర ఎండుగంజాయి(పది ప్యాకెట్లు), 20 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. నిందితుడిపై గతంలో పటాన్‌చెరు, నర్సాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. నెలరోజుల క్రితమే కంది జైలు నుంచి విడుదలయ్యాడు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 1: గుట్టుచప్పుడు కాకుండా అల్లాదుర్గం సమీపంలో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు మెదక్ ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఐబీ గిరిజన తండాకు చెందిన దేవసోత్ మోతీలాల్, విజయ్‌కుమార్ పాలీన్ కవర్‌లో గంజాయి సాగు చేస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించి 13 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నియామక పత్రాలు అందజేయాలి

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని ఆయా గ్రామాల వీఆర్‌ఏల వారసులు గురువారం నాగల్‌గిద్ద తహసీల్దార్ షబానాబి నియామక పత్రాలు అందజేయాలని వినతిపత్రం అందజేశారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు జీవో 81, 85, 98, ప్రకారం విద్యార్హతను బట్టి వివిధ శాఖల్లో నియమిస్తూ ప్రభుత్వం 24-07-2023 ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కాని నేటి వరకు తమకు నియామక పత్రాలు అందలేదని చెప్పారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

రాజీనామా ఉపసంహరణ

తూప్రాన్, ఫిబ్రవరి 1: బీజేపీకి చేసిన రాజీనామాను ఉపసంహరించుకున్నట్లు బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సంఖ్య యాదగిరి గురువారం ప్రకటించారు. తూప్రాన్ మండల బీజేపీ అధ్యక్షుడు మహేశ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అనివార్య కారణాలతో బీజేపీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించినట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ సూచనలతో రాజీనామాను ఉపసంహరించుకున్నట్లు వివరించారు. ఇక నుంచి బీజేపీలోనే కొనసాగనున్నట్లు తెలిపారు.

స్టోన్ క్రషర్లలో తనిఖీలు

జిన్నారం, ఫిబ్రవరి 1: జిన్నారం మండలంలో నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్లపై మైనింగ్, పీసీబీ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు. గురువారం మాదారం, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, శివానగర్ గ్రామాల పరిధిలో 42 స్టోన్ క్రషర్లకు గానూ 21 క్రషర్లలో అధికారులు విచారణ జరిపారు. ఆర్డీవో రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో క్రషర్లలో తనిఖీలు నిర్వహించినట్లు ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ తెలిపారు. ఇటీవల స్టోన్ క్రషర్లలో భారీ ఎత్తున వెలుగు చూసిన అక్రమాలు, మైనింగ్ నిబంధనల ఉల్లంఘనలపై మూడు శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు.

గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా యాదగిరి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 1: గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన జిల్లాల యాదగిరిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర పొలిట్‌బ్యూరో కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న యాదగిరిగౌడ్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించి నియామకపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్‌గౌడ్‌కు యాదగిరిగౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డిజిటల్ క్లాస్‌రూంలను ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి 1: ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయాలని ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి వెంకటేశం కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ డైరీని డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు.

టీఎన్జీవో నీటిపారుదల శాఖ

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 1: మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో గురువారం ఇరిగేషన్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీహర్ష, సహాధ్యక్షులుగా సత్యనారాయణ, కోశాధికారిగా గాంధీబాబు, ఉపాధ్యక్షులుగా వెంకటేశం, సంయుక్త కార్యదర్శి సంతోష్‌తోపాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ఇరిగేషన్ డీఏవో తోటకుమార్, టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, ఉపాధ్యక్షుడు ఫజులొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన

నారాయణఖేడ్/తూప్రాన్, ఫిబ్రవరి 1: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం తూప్రాన్ పట్టణంలో ఎంవీఐ క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యం కారణంగానే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి నడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూప్రాన్-2 ఎస్ఐ యాదగిరి, సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన నిజాంపేటలో జాతీయ రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 161 జాతీయ రహదారి మేనేజర్ మోహీన్, ఖేడ్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, నిజాంపేట సర్పంచు జగన్‌చారి, ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, ఉప సర్పంచు రాంచందర్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన అధికారులు

జహీరాబాద్/రామాయంపేట, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని అక్కన్నపేట ప్రభుత్వ పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలు ఎప్పటికప్పుడు తీర్చాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. డీఈవో వెంట హెచ్‌ఎం పద్మజ ఉన్నారు. జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను తహసీల్దార్ రవీందర్ తనిఖీ చేశారు. 10వ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనకు కృషిచేయాలన్నారు. ఆయనవెంట మండల విద్యాధికారి బస్వరాజ్ ఉన్నారు.

బీసీ కమ్యూనిటీ భవనం ప్రారంభం

కంది, ఫిబ్రవరి 1: కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవనాన్ని గురువారం ఎంపీపీ కాల్వ సరళ, సర్పంచ్ కాసాల మల్లారెడ్డి, బీసీ సంఘం పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గొల్లకుర్మ సంఘం నాయకులు సర్పంచ్ మల్లారెడ్డిని సన్మానించారు. గ్రామాభివృద్ధికి సర్పంచుగా మల్లారెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు వరకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వార్డుసభ్యులు, కార్యదర్శి శ్రీనివాస్, బీసీ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పాపన్నపేటను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట, ఫిబ్రవరి 1: పాపన్నపేట మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో అంగన్‌వాడీ భవనం, పశువైద్యశాలలను, పొడ్చన్‌పల్లిలో పశువైద్యశాల, అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. లక్ష్మీనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ జెండాను ఎగురవేశారు. యూసుఫ్‌పేట, కుర్తివాడ, దౌలాపూర్, రాజ్యాతండా, డాక్యా తండాల్లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా పని చేయాలని సూచించారు. పొడ్చన్‌పల్లి పాఠశాలలో మరుగుదొడ్లు, ఎల్లాపూర్ పాఠశాలలో ప్రహరీల నిర్మాణానికి సహకరిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చందనరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు గౌస్, పీఆర్‌డీఈ పాండు రంగారెడ్డి, ఏడుపాయల మాజీ ఛైర్మన్ ఎన్.జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎల్లాపూర్ ఎంపీటీసీ వసంతశ్రీనివాస్ రెడ్డి, ఏడుపాయల మాజీ డైరెక్టర్ శ్రీధర్, కృష్ణారెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, శెట్టి శ్రీకాంత్ ఉన్నారు.



పొడ్చన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమానికి కృషి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 1: నియోజకవర్గ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగాపూర్, కిషన్‌నాయక్‌తండాలో గ్రామ పంచాయతీ భవనాలను, గంగాపూర్‌లో పాఠశాల అదనపు తరగిత గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నిజాంపేట మండలం రాపర్తికి చెందిన అంతన్నగారి కిషన్‌కు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్వోసీని అందజేశారు. కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు పుండ్లిక్, శ్రీనివాస్, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ ఉన్నారు. కాగా నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు అదనపు బస్సులు కేటాయింపజేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ప్రతిపాదనల ప్రతిని డీఎం అందజేశారు.

- **నాగల్‌గిద్ద:** మండల పరిధిలోని దామర్‌గిద్ద గ్రామంలో గురువారం హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పండరినాథ్‌రావు, సర్పంచులు అనితగుండేరావు, విజయలక్ష్మి, నాయకులు నారాయణజాదవ్, మాణిక్‌రావుపాటిల్ తదితరులు పాల్గొన్నారు.



గంగాపూర్‌లో పాఠశాల అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

అవినీతి బీఆర్‌ఎస్‌ను ప్రజలు తరిమికొట్టారు

● మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చిన్నశంకరంపేట/రామాయంపేట, ఫిబ్రవరి 1: అవినీతి బీఆర్‌ఎస్‌ను ప్రజలు తరిమికొట్టారని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శించారు. గురువారం చిన్నశంకరంపేట, రామాయంపేట ఉమ్మడి మండల బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిచి, కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమాలతోనే తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17 సీట్లు బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవాలంటే ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయి నుంచి పని చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మెదక్ బీజేపీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాగి రాములు, బాలరాజ్, శంకర్‌గౌడ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రామాయంపేటలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

సాంఘికశాస్త్రంపై ప్రతిభా పాటవ పరీక్షలు

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 1: సాంఘిక శాస్త్రంలో పదవ తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించేందుకుగాను సాంఘిక శాస్త్రంపై ప్రతిభా పాటవ పరీక్షలను గురువారం పలు మండలాల్లో నిర్వహించారు. మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 3న జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని విద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టును నోడల్ ఆఫీసర్ విఠల్ అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేదశ్రీ, కృష్ణ పాల్గొన్నారు.

- **వెల్దుర్తి:** రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్వర్యంలో మండల పరిధిలోని కూకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీతారం పాల్గొన్నారు.
- **రేగోడు:** రేగోడు మోడల్ పాఠశాలతో పాటు కస్తూర్బా, ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుశీలరాణి, అశోక్, స్వప్న, మంగ నాయక్, వెంకటరమణ పాల్గొన్నారు.
- **అల్లాదుర్గం:** అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధనుంజయగౌడ్, ప్రవీన్, చిల్వర్ పాఠశాల హెచ్‌ఎంలు లక్ష్మణ్, జనార్ధన్ పాల్గొన్నారు.
- **చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట హైస్కూల్, మోడల్ స్కూల్, కేజీబీవీ, మడూర్, శాలిపేట, మిర్జాపల్లి పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, సాయి చరణ్, బేబి సుధ, జలజ, మంగారాణి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.
- చేగుంట: చేగుంట మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట స్కూల్‌లో గురువారం విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారిణి నీరజ, సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటా గౌడ్, ఆంజనేయులు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఎస్టీయూ మండలాధ్యక్షుడు మనోహర్‌రావు, తపస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్, శ్రీ కృష్ణవేణి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వివేక్ పాల్గొన్నారు.



అల్లాదుర్గంలో నిర్వహించిన పరీక్షలో ప్రశాంస పత్రాలను అందుకున్న విద్యార్థులు

చేగుంటలో 'గావ్ ఛలో అభియాన్'

చేగుంట, ఫిబ్రవరి 1: చేగుంట ఐబీ గెస్ట్ హౌజ్‌లో గురువారం బీజేపీ నాయకులు గావ్ ఛలో అభియాన్(పల్లెకు పోదాం కార్యక్రమం)పై సమావేశం నిర్వహించారు. బీజేపీ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శేఖర్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, భిక్షపతి, ఎల్లారెడ్డి, రవా, ఎల్లేష్, శోభన్, దండు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు

చేగుంట, ఫిబ్రవరి 1: భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నార్సింగి మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్నాల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘ్ ముందుంటుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతు సంక్షోభంలోనే ఉన్నాడన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్నాల వెంకటరెడ్డి, మెదక్ జోనల్ అధ్యక్షుడు రాజా శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, సంఘం సభ్యులు నరసింహారెడ్డి, కొన్యాల సోమరాజు, నాగోజి, రామ్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గిరికల దుబ్బయ్య, పోచమ్మల స్వామి, శ్రీశైలం, పోచమ్మల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 1: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గంనకు చెందిన కప్పర భేతయ్య(35) మండలంలోని గడిపెద్దాపూర్ సమీపంలోని బ్రిడ్జి పైనుంచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్: మనోహరాబాద్ గ్రామానికి చెందిన గుడ్లచీ రమేష్ గ్రామ పంచాయతీ కార్మికుడి పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి దండుపల్లి బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

గుమ్మడిదల, జనవరి 1: అతిగా మద్యం తాగడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం గుమ్మడిదల మండలం అన్నారంలో జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన గోవిందా రాజపూర్(32) నాలుగు రోజులుగా అతిగా మద్యం తాగుతున్నాడు. గురువారం అన్నారంలోని వైన్స్ షాప్ వద్ద మరోసారి మద్యం తాగి, అక్కడే నిద్రించాడు. చుట్టుపక్కల ఉన్న వ్యక్తులు గమనించి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. నాలుగైదు రోజులుగా మోతాదుకు మించి మద్యం సేవించినందుకే మృతిచెందాడని మృతుడి బంధువు జార్ బహదూర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

బావపై కత్తితో దాడి చేసిన బావమరిది

మనోహరాబాద్, ఫిబ్రవరి 1: స్నేహితులతో కలసి బావపై బావమరిది కత్తితో దాడి చేసిన ఘటన మండల పరిధి కూచారంలో చోటుచేసుకున్నది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూచారం గ్రామానికి చెందిన బొంతపల్లి అరుణ్, కామారెడ్డి జిల్లా దేవునిపల్లి గ్రామానికి చెందిన శ్యామలను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలలుగా వారిద్దరి మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. శ్యామల సోదరుడు శ్యామ్‌సుందర్, అతడి ఇద్దరు స్నేహితులతో కలసి కూచారం గ్రామంలోని ఓ వెంచర్ వద్ద ఉన్న అరుణ్ వద్దకు కారులో వెళ్లి కడుపులో కత్తితో పొడిచారు. హత్యాయత్నానికి పాల్పడిన శ్యామ్‌సుందర్, స్నేహితులు అఫ్రాజ్, చేతన్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

ఖేడ్ రాంమందిర్ పాలక మండలి

ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 1: నారాయణఖేడ్‌లోని రాంమందిర్ పాలక మండలి ఏర్పాటు కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ ఇన్‌చార్జి ఈవో మోహన్‌రెడ్డి గురువారం ప్రటకనలో తెలిపారు. పాలక మండలిలో ఉండేందుకు ఆసక్తి గల వారు 20 రోజుల్లో తమ దరఖాస్తులను హైదరాబాద్‌లోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో గాని లేదా సంగారెడ్డిలోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో గాని సమర్పించవచ్చని తెలిపారు. వివరాల కోసం సంగారెడ్డిలోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

వరి సాగులో సమగ్ర సస్యరక్షణపై రైతులకు శిక్షణ

చేగుంట, ఫిబ్రవరి 1: వరి సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని ఉల్లి తిమ్మాయిపల్లి గ్రామంలో సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సస్యరక్షణ అధికారి ఆర్.సునీత ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో పాటించవలిసిన మెలుకువల గురించి, పంట దిగుబడిపై సలహాలు సూచనలు చేశారు. వరి పంటను ఆశించే చీడపీడలను నివారించేందుకు వివిధ పద్ధతులను వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, కీటక శాస్త్రవేత్త రవికుమార్, సహాయ సస్య రక్షణ అధికారిణి నీలా రాణి, మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, అదనపు వ్యవసాయ అధికారులు శోభారాణి, ప్రవీణ్, భువనేశ్వరి, మాధవి, అశోక్‌రెడ్డి, ఉల్లి తిమ్మాయిపల్లి మాజీ సర్పంచ్ సత్యమ్మ, సొసైటీ ఛైర్మన్ రాములు, రైతులు పాల్గొన్నారు.